క్లుప్తంగా

విద్యాభివృద్ధికి బిగ్ హెల్ప్ సాయం



తర్లుపాడు జెడ్పీ పాఠశాలలో సంస్థ ప్రతినిధులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్టేషనరీ, దుస్తులను అందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయం అందిస్తున్న సంస్థను హెచ్ఎం సుధాకర్ అభినందించారు. ప్రతినిధులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న మైనారిటీ పరిరక్షణ సమితి సభ్యులు

పెద్దదోర్నాల: మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా రోగులకు అల్పాహారం అందించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పూలబాబు తదితరులు పాల్గొన్నారు.

విన్నర్స్‌గా నిలిచిన కొత్తపేట టీమ్



వాలీబాల్‌లో గెలుపొందిన క్రీడాకారులు

బేస్తవారిపేట: మండలంలోని కొత్తపేటకు చెందిన జట్టు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో సత్తాచాటారు. హోరాహోరీగా జరిగిన మహిళల వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారు. పంచాయతీ కార్యదర్శి బాలకోటారెడ్డి, పీఈటీ శ్రీనివాసులు,ఎంపీడీఓ పార్వతిలు గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

చిత్రలేఖనంలో అశ్వని జిల్లా టాపర్



కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న అశ్వని

కురిచేడు: మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వేమ అశ్వని చిత్రలేఖనంలో జిల్లా టాపర్‌గా నిలిచింది. పాఠశాల ఎస్ఎస్ ఉపాధ్యాయులు సీహెచ్ఎస్ఆర్‌వీ ప్రసాదరావు మార్గదర్శకత్వంలో విద్యార్థిని ఇన్నోవేటివ్ ఇండియా వీరగాథ విభాగంలో చిత్రలేఖనం వేసింది. ఆ చిత్రలేఖనం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఒంగోలులో ప్రశంసపత్రం అందుకుంది. విద్యార్థినిని హెచ్ఎం పాపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

కొమరోలు: గ్రామాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డిజిటల్ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రవినాయక్ తెలిపారు. కొమరోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఇడమకల్లులో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రపరిచారు. రవినాయక్ ప్రజలకు అవగాహన ఏర్పాటు చేసి గ్రామాన్ని ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు అబ్బూరి అల్లూరయ్య పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో చోరీ



లోపల దొంగతనం జరిగిన ప్రాంతం

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు పడి టీవీ, కంప్యూటర్, కీ ప్యాడ్, వైఫై బాక్స్‌లు దొంగిలిచుకెళ్లారు. వీఏఏ రమావత్ గంగా సోమ్లానాయక్ తెలిపిన వివరాల మేరకు తోటి ఉద్యోగి శివకుమార్‌రెడ్డి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం పూర్తయిన తర్వాత తాళం వేసి ఇద్దరూ ఇంటికి వెళ్లారు. శనివారం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసే సరికి పైవస్తువులు కనిపించలేదు. దొంగలు పడ్డారని తెలుసుకున్న వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న చంద్రశేఖర్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

● ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం గడియార స్తంభం సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం డ్వాక్రా బజారులో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను సకాలంలో అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఆసరా ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా కుటుంబాలను అభివృద్ధి చేసుకుంటున్నారని తెలిపారు. నాలుగో విడత ఆసరా చెక్కులను అందజేశారు. అనంతరం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ రవీంద్ర, డీఎల్‌డీఓ సాయికుమార్, కౌన్సిలర్లు దొడ్డ భాగ్యలక్ష్మి, హర్షిత, కోఆప్షన్ మెంబరు వనజాక్షి, నాయకులు శ్రీనివాసులు, ఉత్తమ్, కాటమయ్య, బాషా, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీని కలిసిన తాడిపత్రి చంద్రశేఖర్

మార్కాపురం: మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిపత్రి చంద్రశేఖర్ శనివారం మార్కాపురంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. చంద్రశేఖర్ ఇటీవలే వై.పాలెం ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా మొదటిసారిగా ఎమ్మెల్యేను కలిశారు. మాజీ జెడ్పీటీసీ డి. వెంకటరెడ్డి, ఎంఎస్ రెడ్డి, తదితరులున్నారు.

ఇంటర్‌లో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే లక్ష్యం

● గుంటూరు ఆర్‌జేడీ సుబ్బారావు



ఆర్‌జేడీని సన్మానిస్తున్న అధ్యాపకులు

కంభం: పాఠశాల స్థాయిలోనేగాక ఇంటర్మీడియెట్ దశలో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఇంటర్మీడియెట్ విద్యామండలి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల 54వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం విరివిగా నిధులు వెచ్చిస్తోందని, ఆంగ్ల మాధ్యమంతో పాటు స్కిల్ హబ్ కేంద్రాల ద్వారా త్వరితగతిన ఉపాధి పొందగలిగే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం విజయీభవ పేరుతో తప్పనిసరిగా ఉత్తీర్ణులయ్యేందుకు 50 రోజుల కార్యాచరణను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి విద్యార్థి దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్య ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంటర్ బోర్డు ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ మాట్లాడుతూ 2023–24లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగిందన్నారు. ఇంకా ప్రవేశాలు పెరిగేందుకు రానున్న విద్యా సంవత్సరానికి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. నాడు – నేడు ద్వారా మౌలిక వసతులు, బోధనా వసతులు పెరిగాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎంఈఓ మాల్యాద్రి, పీడీ మురళి పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

మార్కాపురం రూరల్: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి లభిస్తుందని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ మురళి అన్నారు. శనివారం మోడల్ స్కూల్‌ను మార్కాపురంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. వృత్తి విద్యా కోర్సుల గురించి ఉపాధ్యాయులు సుధాకర్, సంధ్యారాణి, ఉస్మాన్ బాషా, చిన్న రెడ్డయ్య వివరించారు.

స్వచ్ఛందంగా వీధి దీపాల ఏర్పాటు



వీధిలైట్లు వేస్తున్న ఎలక్ట్రీషియన్

దొనకొండ: స్థానిక బ్రహ్మారావుపేటలో ప్రజలు స్వచ్ఛందంగా వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నారు. బ్రహ్మారావుపేటలోని హోసన్నా ప్రార్థన మందిరానికి వెళ్లే రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయక పోవటంతో కొన్ని రోజుల నుంచి అంధకారం నెలకొంది. పలు సార్లు సంబంధిత పంచాయతీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. చర్చికి వెళ్లే క్రైస్తవ సోదరులు, పాదాచారులు, వాహన చోదకులు రాత్రి వేళల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలు, కో ఆప్షన్ సభ్యులు షేక్ గఫార్, ఎంపీటీసీ గుంటు అజయ్, మాజీ జెడ్పీటీసీ పులిమి రమణాయాదవ్, పులిమి శ్రీరాములు, అమీర్, వాహిద్, ప్రసాద్ ఆర్థిక సాయంతో స్వచ్ఛందంగా వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నారు. దాతలకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ, ఎంవీఐలు

మార్కాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా ఉత్సవాల సందర్భంగా శనివారం పట్టణ పోలీసు స్టేషన్ దగ్గరనుంచి మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆర్టీవో అమర్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. ఆర్‌టీఓ అమర్‌నాయక్, ట్రైనీ డీఎస్పీ షెహవాజ్, ఎంవీఐ మాధవరావు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రవాణాశాఖ ఏర్పాటుచేసిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం

దర్శి: వాహన దారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని డీఎస్పీ అశోక్‌వర్ధన్ అన్నారు. దర్శిలో జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి డీఎస్పీ అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాలు నివారించాలంటే కఠిన నిబంధనలే మార్గం అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కువ మంది ఎక్కితే వాహనాలు రిపేర్లు రావడమే కాకుండా రన్నింగ్‌లో వాహనాలు కంట్రోల్ తప్పి ప్రమాదాల పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎంవీఐలు రవికుమార్, రామచంద్రరావులు మాట్లాడుతూ ప్రయాణాలు చేసే డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో తమ కుటుంబాలను కూడా గుర్తుకు తెచ్చుకుని వాహనాలు నడపాలని సూచించారు. జరగరాని ప్రమాదాలతో కుటుంబ సభ్యులు అనాథలుగా మరతారని పేర్కొన్నారు. తమను నమ్ముకున్న కుటుంబం కోసం క్షణికకాలం ఆలోచించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. విద్యార్థులు, వాహనదారులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

త్రిపురాంతకం: విద్యుత్ షాక్ గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. మండలంలోని మిట్టపాలెం గ్రామానికి చెందిన నక్కా చిన్న మల్లారెడ్డి (65) పొలంలో టమోట కోస్తున్న సమయంలో బోరు కోసం అమర్చిన విద్యుత్ వైర్లు పక్కనే ఉన్న స్తంభానికి ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడం దానిని పొరపాటున తగిలి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

48 మద్యం బాటిళ్లు పట్టివేత

దొనకొండ: మండలంలోని మల్లంపేటలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న 48 మద్యం బాటిళ్లను ఎస్ఐ సైదుబాబు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు ఆయన తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్శి సబ్ కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసరా సభ విజయవంతం చేయండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వసుంధరాదేవి, శంకరరావు

దర్శి: వైఎస్సార్ ఆసరా సభ విజయవంతం చేయాలని వైఎస్సార్ కేపీ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఎంపీడీఓ శంకరరావు కోరారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో ఈ నెల 30వ తేదీన జరగనున్న వైఎస్సార్ ఆసరా సభ ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. వసుంధరాదేవి, శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డ్వాక్రా రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ.21 కోట్ల 6 లక్షల రూపాయలు మహిళలకు రుణమాఫీ నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో విడతగా 7 కోట్ల 22 లక్షల రూపాయలు 1002 సంఘాలకు జమ చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మ, నాగిరెడ్డి, వేముల పద్మా జానకిరామయ్య, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వేముల శ్రీను, మేకల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాస రెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.







కలెక్టర్ దినేష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న ఏఎస్ఐ గోపాలకృష్ణ, ఇరసలగుండం గ్రామ అసిస్టెంట్ ఉండేల జ్యోతి, బేస్తవారిపేట సీనియర్ అసిస్టెంట్ కరిముల్లా







సలకలవీడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ దేశిరెడ్డి శిరీష, గొట్లగట్టు గ్రామ పంచాయతీ లైన్‌మెన్ రమేష్, జిల్లా ఉత్తమ వ్యవసాయాధికారి ప్రసాదరావును సన్మానిస్తున్న డీలర్లు

వైభవంగా రామయోగి స్వామి తిరునాళ్ల



శ్రీవారికి పూజలు



రామయోగి స్వామి

పొదిలి రూరల్: మండలంలోని సూదనగుంట, జువ్వలేరు గ్రామాల్లో వేంచేసిన రామయోగి స్వామి తిరునాళ్ళ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి, తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి తిరునాళ్ళ సందర్భంగా సూదనగుంటలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా, జువ్వలేరు గ్రామస్తులు మూడు విద్యుత్ ప్రభలు, నాలుగు పాట కచేరీలతో పాటు కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది.

వెలుగొండలో భక్తుల సందడి

కొనకనమిట్ల: పుష్య మాసం శనివారం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు రావటంతో సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మి అలివేలుమంగ వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఎత్రం కమిటీ సభ్యులు జగన్, రత్నంశెట్టి, జి.లక్ష్మీనారాయణ అన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులు



గెలుపొందిన మహిళా క్రికెట్ జట్టుతో అధికారులు



గొట్లగట్టు క్రీడాకారులు

పెద్దదోర్నాల: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఫైనల్ విజేతగా పెద్దదోర్నాల మహిళా క్రికెట్ జట్టు నిలిచింది. శనివారం యర్రగొండపాలెంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యర్రగొండపాలెం జట్టుపై పెద్దదోర్నాల సచివాలయం –1 జట్టు విజయం సాధించింది. జట్టులో అన్ని విభాగాల్లో రాణించిన కీర్తిని ఆల్‌రౌండర్‌గా ఎంపికైంది. జట్టు విజయం సాధించడంపై ఫిజికల్ డైరెక్టర్ రామానాయక్, ఆయూబ్‌లు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు మండలంలోని మోట్లమల్లికార్జునపురం మోడల్ పాఠశాలకు చెందిన వాలీబాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ సిద్ధయ్యలు హర్షం వ్యక్తం చేశారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందనలు

కొనకనమిట్ల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల నియోజకవర్గ స్థాయిలో మార్కాపురంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో మండలంలోని గొట్లగట్టు సచివాలయ పరిధిలోని క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. ఆ మేరకు ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన గొట్లగట్టు ఖోఖో క్రీడాకారులైన గుమ్మా శ్రీను, పావులూరి బ్రహ్మేంద్ర, గురజాల వెంకటేశ్వర్లు, కొక్కెర ఏడుకొండలు, కొణిజేటి సురేష్‌ల బృందాన్ని ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, సచివాలయ కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో ఒంగోలులో జిల్లా స్థాయిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర ఖోఖో పోటీల్లో గొట్లగట్టు క్రీడాకారులు పాల్గొంటారని ఆడుదాం ఆంధ్ర పీఈటీలు ఉప్పుటూరి శ్రీనివాసులు, వై.బాలగురవయ్య అన్నారు.

వెలుగువారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెలుగువారిపాలెం (ముండ్లమూరు): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణ జరుగుతుందని తాళ్లూరు ఎంపీడీఓ కెవై కీర్తి అన్నారు. తాళ్లూరు మండలం వెలుగువారిపాలెంలో శనివారం తూర్పుగంగవరం పీహెచ్‌సీ పరిధిలో జగనన్న సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఎం.కోటేశ్వరమ్మ, ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి, ఎంపీడీఓ కేవై కీర్తిలు ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మౌనిక, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు హెమాంజలి, రఘునందన్‌లు 305 మందికి పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఈసీజీ, హెచ్‌బీ, యూరిన్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 45 మందికి కంటి పరీక్షలు చేశారు. హెచ్ఈఓ చంద్రశేఖర్‌బాబు, పీహెచ్ఎన్ మస్తానమ్మ, హెచ్‌వీ సుశీల పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



క్రీడాకారులతో ఉన్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. రిపబ్లిక్ డే ఫుట్‌బాల్ పోటీలను గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణరెడ్డి ఆధ్వర్యంలో కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం ప్రారంభించారు. పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అమూల్య మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ స్థాయిలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీల్లో విజయం సాధించిన వారికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, 7500 రూపాయలు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రమాదేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పతకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. శనివారం పట్టణంలోని నాయుడు బజారులో వికసిత భారత్ సంకల్ప యాత్ర సభను నిర్వహించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్, హౌసింగ్ ఏఈ చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.